బాలికలకు సదవకాశం

- టెక్కలిలో బాలికల జూనియర్ కళాశాల
- ఎంపీసీ, బైపీసీ విభాగంలో 80 సీట్లు
- ఇప్పటికే 64 మంది చేరిక





టెక్కలిలోని బాలికల జూనియర్ కళాశాల

టెక్కలి:

ఐదేళ్ల క్రితం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత డివిజన్ కేంద్రమైన టెక్కలిలో బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటైంది. ఇక్కడ బాలిక కళాశాల కావాలని అనేక సంవత్సరాలుగా ఈ ప్రాంతీయలు కోరుకునేవారు. చివరికి వారి కల నెరవేరింది. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలోనే బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం అర్హులైన బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇంగ్లిష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ విభాగంలో మొత్తం 80 సీట్లు కేటాయించారు. ప్రస్తుతానికి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 32 మంది, బైపీసీ గ్రూపులో 32 మంది విద్యార్థినులు చేరారు. కళాశాలకు ఆనుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థినులకు వసతి గృహాల్లో నేరుగా చేరేందుకు సదుపాయం కల్పిస్తున్నారు. దీంతో సుదూరు ప్రాంతాల నుంచి విద్యార్థినులు ఈ కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎంపీసీ, బైపీసీ కోర్సులకు సంబంధించి తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల బోధనకు పూర్తిస్థాయిలో లెక్చరర్లు ఉన్నారు. జూన్ ఒకటో తేదీ నుంచి తరగతులు కూడా ప్రారంభమవుతాయి.

విద్యార్థినులు ఆసక్తి చూపుతున్నారు



ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చేరేందుకు విద్యార్థినులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతానికి 64 మంది ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరారు. సుదూర ప్రాంతాల విద్యార్థినులకు వసతిగృహం సదుపాయం కల్పిస్తున్నాం. మా పాఠశాల నుంచి ఇటీవల పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇక్కడే ఇంటర్ చదివేందుకు మక్కువ చూపుతున్నారు.

–ఎస్.శోభారాణి, ప్రధానోపాధ్యాయురాలు

పింఛన్ల పంపిణీకి చర్యలు



కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

కవిటి: సామాజిక పింఛన్ల పంపిణీలో జూన్ నెలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల మార్గదర్శకాల్ని పక్కాగా అమలు చేయాలని ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. తన కార్యాలయంలో ఈఓపీఆర్డీ శివాజీపాణిగ్రాహి, పంచాయితీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. తాజా ఆదేశాల ప్రకారంగా 9068 మందికి ప్రత్యక్ష నగదు బదిలీ(డీబీటీ) విధానంలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు పింఛన్ మొత్తాన్ని జమచేస్తామని చెప్పారు. అలాగే వివిధ కారణాల వల్ల మండల వ్యాప్తంగా 23 పంచాయతీల్లో 2,550 మంది లబ్ధిదారులకు డోర్ టు డోర్ కనెక్టివిటీ ద్వారా నేరుగా వారి ఇళ్లకు వెళ్లి ఈ నెల పెన్షన్ అందించేందుకు సంబంధిత కార్యదర్శులు బాధ్యత వహించాలన్నారు. ఈ ప్రక్రియ ప్రభుత్వం సూచించిన మేరకు గ్రామాల్లోని పెన్షన్‌దారులకు వివరంగా తెలియజేయాలని కార్యదర్శులకు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

అలరించిన తప్పెటగుళ్ల ప్రదర్శన



ప్రదర్శనలో శంకరరావు బృందం

కాశీబుగ్గ: గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జానపద సంబరాల్లో పలాస మండలం రేగులపాడు, చీపురుపల్లి గ్రామాలకు చెందిన తప్పెటగుళ్ల బృందం సభ్యుల ప్రదర్శన అక్కడి వారిని అలరించింది. గురువులు పానిల శంకరరావు, కోనారి సూదన్ ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు కళాకారులకు మెమెంటోలను అందజేసి అభినందించారు.

క్లుప్తంగా

అండర్-15 జిల్లా బాలికల క్రికెట్ జట్టుకు నిఖిలసాయి ఎంపిక



నిఖిలసాయి

ఇచ్ఛాపురం: అండర్ –15 క్రికెట్ బాలికల జట్టుకు ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన దట్టి నిఖిలసాయి ఎంపికైంది. ఈ విషయాన్ని ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ కోచ్ డి. గోపి శుక్రవారం తెలిపారు. నిఖిల జిల్లా జట్టుకి ఎంపికై నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శాస్త్రి, జిల్లా క్రికెట్ పర్యవేక్షకులు ఇలియాజ్ అహ్మద్‌లు శుక్రవారం సమాచారం అందజేసినట్లు కోచ్ పేర్కొన్నారు. నిఖిలసాయి జిల్లాజట్టుకు ఎంపిక కావడంపై తల్లిదండ్రులు ఈశ్వర్, త్రివేణి సంతోషం వ్యక్తం చేశారు. జీఎస్ఆర్ హైదరాబాద్ క్రికెట్ అకాడమీ చైర్మన్ ఎస్‌గోపాలరావు, స్థానిక సీనియర్ క్రికెటర్లు, క్రీడాకారులు నిఖిలసాయికి అభినందనలు తెలియజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కాశీబుగ్గ: కాశీబుగ్గ పట్టణ పరిధిలో ఈ నెల రెండో తేదీ ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు పలాస ఈఆర్ఓ కార్యాలయ ఎగ్జిగ్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 11 కేవీ లైన్ మరమ్మతులు చేపడుతున్నందున కాశీబుగ్గ పట్టణ పరిధిలోని శ్రీనివాసనగర్, రోటరీనగర్, నెహ్రూనగర్, నిత్యానందనగర్, ఎంపీడీవో ఆఫీస్ రోడ్డు, పండా క్వార్టర్స్, పండాతోట తదితర ప్రాంతాలకు సరఫరా నిలిపి వేస్తున్నామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రిటైర్డు వైద్యాధికారికి సత్కారం



రవీంద్రకుమార్‌ను సత్కరిస్తున్న సీహెచ్‌సీ సిబ్బంది

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి (సీహెచ్‌సీ)లో వైద్యాధికారిగా సేవలు అందించి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ అత్తోటి రవీంద్రకుమార్‌ను సిబ్బంది ఘనంగా సత్కరించారు. వైద్యాధికారి డాక్టర్ పి.దేవేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దుశ్శాలువతో రవీంద్రకుమార్‌ను సత్కరించి గౌరవించారు.

శివప్రసాద్ సేవలు మరువలేనివి



శివప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

నందిగాం: నందిగాం ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించి శుక్రవారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందిన జి.శివప్రసాద్ సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు. స్థానిక సీతారామ కల్యాణ మండపంలో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో శివప్రసాద్‌ను సత్కరించారు. ఈఓపీఆర్డీ రాజారావు, ఎంఈఓ నర్సింహులు, ఏపీఓ నాగరాజులు, ఏపీఎం జాంబవతిలు మాట్లాడుతూ.. శివప్రసాద్ సేవలను గుర్తు చేశారు. ఉద్యోగులు చేసిన సేవలే వారిని ప్రజలకు చేరువ చేస్తాయని అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఆయన చేసిన సేవలు చిరకాలం నిలిచిపోతాయని కొనియాడారు. అనంతరం శివప్రసాద్ దంపతులకు పూలమాలలతో సత్కరించి, దుశ్శాలువలు కప్పి, జ్ఞాపికను బహూకరించారు. అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ.. తన ఉద్యోగ కాలంలో సహకరించిన కార్యాలయ, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కంచిలి: తలతంపర గ్రామంలో పూజలందుకుంటున్న సింధుపటరాణి అమ్మవారి ఆలయం రెండో వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక సర్పంచ్ జగబంధు, బొగాబెణి సర్పంచ్ గణప సింహాచలం, నాయకులు దుర్గాసి ధర్మారావు, డొక్కరి బలరాం ఉన్నారు.

యువతికి రూ. 50 వేలు సాయం



వెంకటలక్ష్మి తల్లికి సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: ఆటో బోల్తాపడిన సంఘటనలో యువతి వెంకటలక్ష్మి తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈమెది నిరుపేద కుటుంబం. ఈ విషయం తెలుసుకున్న పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన హెల్పింగ్ వారియర్స్ సెల్ స్టాటస్‌లో వెంకటలక్ష్మి గురించి పెట్టారు. దీంతో చాలామంది స్పందించి సాయం చేశారు. ఇలా 50 వేల రూపాయలు సేకరించారు ఈ మొత్తాన్ని వెంకటలక్ష్మి తల్లికి శుక్రవారం అందజేశారు.

రుచిగా మధ్యాహ్న భోజనం



మాట్లాడుతున్న విజయకుమారి

కాశీబుగ్గ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని పెట్టాలని మధ్యాహ్న భోజన నిర్వాహకుల శిక్షణ తరగతుల పరిశీలకులు, డిప్యూటీ ఈవో ఆర్.విజయకుమారి అన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 17వ వార్డు సాయికాలనీ యూపీ స్కూల్‌లో 89 మంది ఎండీఎం నిర్వాహకులకు శుక్రవారం నిర్వహించిన శిక్షణ తరగతులను ఆమె పరిశీలించి మాట్లాడారు. మెనూ ప్రకారం.. రుచికరంగా వంటలను ఎలా తయారు చేయాలో డిజిటల్ స్క్రీన్‌పై చూపించి అవగాహన కల్పించారు. పలాస మండల విద్యాశాఖాధికారులు చెరుకుపల్లి సత్యం, సీహెచ్ శ్రీనివాసరావు, సీఆర్ఎంటీఎస్‌లు ఉర్నాన అప్పలరాజు, శేషగిరిరావు, దుర్యోధన, కేశవరావు, సునీల్ కుమార్, భాస్కరరావు, ఐఈఆర్‌టీ రవికుమార్, శివకుమార్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ప్రసన్నలత తదితరులు

కోటబొమ్మాళి: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని కోటబొమ్మాళి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. కోర్టు ఆవరణలో సిబ్బంది, న్యాయవాదులతో కలిసి శుక్రవారం మొక్కలు నాటారు. సకల జీవరాసులకూ ప్రాణవాయువు అందిస్తున్న మొక్కలను పెంచేందుకు కృషి చేయాల కోరారు. ఏజీపీ సంపతిరావు తిరుపతి, బార్ అసోసియేషన్ అధక్షుడు లఖినేని శ్రీనివాసులు, కార్యదర్శి ఉప్పాడ తిరుమలరావు, కోర్టు సూపరింటెండెంట్ ముద్దాడ వెంకటరావు, ఏపీపీ డి.హరిప్రియ ఉన్నారు.

పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

పలాస: పొగాకుతోపాటు ఇతర మత్తు పదార్థాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సునీల్‌కుమార్ అన్నారు. రెంటికోట పీహెచ్‌సీ ఆవరణలో శుక్రవారం వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజలకు అవగాహన కల్పించారు. పొగాకు సేవించరాదని వైద్య కేంద్రం ఆవరణలో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తులను సేవించరాదన్నారు. చెడు మార్గాల్లో ప్రజలు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పిల్లలను సక్రమ మార్గంలో నడిపించాల్సిన బాధ్యత వారి తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, పి.హెచ్ ఎస్.సత్యవతి, హెచ్ఎస్ ఎన్.రుషికేశ్వరరావు, సుదర్శన, యూడీసీ ఫార్మసీ అధికారి బోనెల గోపాలరావు, కమల,హేమలత, మేరీ, సరస్వతి, రోజా, భరద్వాజ్, నిహారిక, సీలావతి, తేజ, పావని, తేజశ్విని, సుధా, ఆశాదేవి పాల్గొన్నారు.

త్రికుంతేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

ఇచ్ఛాపురం రూరల్: తిప్పనపుట్టుగలోని త్రికుంతేశ్వర స్వామి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రవాసాంధ్రుడు తిప్పన శంకర్‌రెడ్డి దంపతులు స్వామివారికి రుద్రాభిషేకం జరిపించారు. అలాగే ఉద్దానం సంగీత కళా కారులతో ఉదయం నుంచిసాయంత్రం వరకు కచేరీ జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి



కాశీబుగ్గ: పద్మనాభపురంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ దానమ్మ



వజ్రపుకొత్తూరు: ర్యాలీ చేస్తున్న పీవో శార్వాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు

వజ్రపుకొత్తూరు: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ కనబరచాలని కాశీబుగ్గ ఐసీడీఎస్ పీవో డి.శార్వాణి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రపంచ రుతుక్రమం–ఆరోగ్యం పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా వజ్రపుకొత్తూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా తల్లులు అవగాహన కల్పించాలన్నారు. ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. నెలసరి సమయాల్లో నీరు ఎక్కువగా తీసుకోవాలని.. లేకుంటే కడుపునొప్పి సమస్యలు ఇబ్బంది పెడతాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు గంగమ్మ, ధనలక్ష్మి, జయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: మందసలో సెర్ప్, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికల వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఎం గొడబ ప్రసాదరావు, సీడీపీవో కె.వసుంధరదేవిల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సీసీలు కిశోర్, కూర్మారావు, సూపర్‌వైజర్‌లు జయలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు. అదేవిధంగా కాశీబుగ్గ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి మూడోవార్డు పద్మనాభపురం గ్రామంలో సూపర్‌వైజర్ ఉర్నాన దానమ్మ ఆధ్వర్యంలో కిశోర బాలికల వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

చినబాడంలో పోలీస్ బందోబస్తు



గస్తీలో పోలీసులు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ ఏడో వార్డు చినబడం గ్రామంలో పోలీసు బందోబస్తును పటిష్టం చేశారు. ఓట్ల లెక్కింపు సమయం సమీపిస్తుండడంతోపాటు ఎగ్జిట్‌పోల్ ఫలితాలు శనివారం వస్తున్న నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా పోలీసులు ముందస్తుగా బందోబస్తును పెంచారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నుంచి ఇప్పటివరకు ఈ గ్రామంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. వజ్రపుకొత్తూరు మండల కేంద్రానికి చినబడాం ఈ గ్రామం మీదుగానే రోడ్డు సౌకర్యం ఉండడంతో కాశీబుగ్గ పోలీసులు చెక్ పోస్టును సైతం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన పలువురిని బైండోవర్ కూడా చేశారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు



హాజరైన కౌన్సిల్ సభ్యులు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

- ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన శుక్రవారం సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. మంచినీటి సమస్య పరిష్కారంతో పాటు పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లించడం తదితర నాలుగు అంశాలతో కూడిన అజెండాను సభ్యులు ఆమోదించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్–2 లాబాల స్వర్ణమణి మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధిపై పత్రికా ప్రకటనలు ఎందుకని ప్రశ్నించారు. సమస్యలపై కౌన్సిల్ సభ్యులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో మూడేళ్లుగా పాడైన ఏసీలను బాగు చేయని అధికారులు మున్సిపాలిటిలో చేపట్టిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్–1 ఉలాల భారతిదివ్య పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాల్లోనే పింఛన్లు

కంచిలి: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జూన్ నెలకు సంబంధించిన సామాజిక భద్రత పింఛన్లను 75 శాతం మందికి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనున్నట్లు ఎంపీడీవో వి.నీరజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన వృద్ధులు, దివ్యాంగులు, బ్యాంకు ఖాతాలేని వారికి వారి ఇళ్ల వద్దనే సచివాలయ ఉద్యోగుల ద్వారా శనివారం పంపిణీ చేసేలా చర్యలు చేపట్టామన్నారు. పింఛన్ లబ్ధిదారులంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ఆదిత్య అధ్యాపకునికి డాక్టరేట్ ప్రదానం



గోవిందరాజులు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పొందూరు మండలం గొరింట గ్రామానికి చెందిన బాడాన గోవిందరాజులు గౌరవ డాక్టరేట్ పొందారు. ఈ మేరకు కళాశాల యాజమాన్య ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆల్ స్టీల్ శాండ్‌విచ్ ప్యానెల్‌ను ఉపయోగించే డెక్ సిస్టమ్ కోసం డిజైన్ అండ్ స్ట్రక్చరల్ ఆప్టిమైజేషన్ మెథడ్ అనే అంశంపై రాజస్థాన్‌కు చెందిన సన్‌రైజ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ ఎం.పళనిసామి ఆధ్వర్యంలో చేపట్టిన పరిశోధనలకు డాక్టరేట్ అందజేశారు. గోవిందరాజులకు డాక్టరేట్ రావడంపై కళాశాల యాజమాన్యంతో పాటు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

నర్సింగ్ విద్యార్థినికి ఆర్థికసాయం



మీనాకు సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని చిన్న యర్రగోవిందపుట్టుగ గ్రామానికి చెందిన యర్ర మీనాకు కవిటికి చెందిన చింతామణి ఆలయ కమిటీ సభ్యులు సర్పంచ్ పూడి లక్ష్మణరావు సమక్షంలో శుక్రవారం ఆర్థికసాయాన్ని అందించారు. మీనా ఒంగోలు కిమ్స్ కళాశాలలో నర్సింగ్ మూడవ సంత్సరం చదువుతోంది. చింతామణి అమ్మవారి ట్రస్ట్ హైదరాబాద్ వారు రెండేళ్లుగా చదువు నిమిత్తం పూర్తిగా సహాయ సహకారం అందిస్తున్నారు. ఈ సంవత్సరం ఫీజు, హాస్టల్ నిమిత్తం ఇందిర దేవి, చింతామణి కుమార్ సహాయంతో రూ.40 వేలను విద్యార్థినికి అందజేసి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో అమ్మవారి ఆలయం కమిటీ, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పి. చంద్రశేఖర్, పి.లక్ష్మణమూర్తి, పి.జయరావు ఉన్నారు.

రెండు ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్ వద్ద అధికారులు

సోంపేట: మండలంలోని మహేంద్ర తనయ నదిలో నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలాస స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా గురించి తనిఖీలు చేపట్టారు. మండలంలోని ఎంజీపురం పంచాయతీ వద్ద ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను ఆరు టన్నుల ఇసుకతో సీజ్ చేశారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్ మెంట్ ఇన్‌స్పెక్టర్ జైభీమ్, టెక్కలి మైనింగ్ శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ కె.ఎల్.వి.గణేష్, నీటిపారుదల శాఖ డీఈ జి.వి.రమణ, ఏఈ సూర్యప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, జేఈలు పి.ఎల్.ఎన్.ప్రసాద్, కమల్ వికాస్, ఆర్.ఐ.రవికుమార్, బారువ ఎస్సై చంద్రశేఖర్ ఉన్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారుల గుర్తింపునకు సర్వే



ఇచ్ఛాపురం: కండ్రవార్డు అంగన్‌వాడీ కేంద్రంలో సర్వే చేస్తున్న సహిత ఉపాధ్యాయులు



టెక్కలి రూరల్: చిన్నారి వివరాలు సేకరిస్తున్న సహిత ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక అవసరాల చిన్నారులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంఈవో కె. అప్పారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సమగ్రశిక్షా సహిత ఉపాధ్యాయులు మున్సిపాలిటీ పరిధి కండ్రవార్డులో గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం, ఆ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక అవసరాలు చిన్నారుల గురించి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు చిన్నారులకు భవిత కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న సేవలు గురించి చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు ఎస్.సూర్యం, హెచ్ సోమేష్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకుల ఆదేశాల మేరకు టెక్కలి మండలంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల పిల్లల గుర్తింపు సర్వే తీరును ఎంఈవోలు డి.తులసీరావు, డి.చిన్నారావు శుక్రవారం పరిశీలించారు. మూడు నుంచి 18 ఏళ్ల వయస్సు మధ్య ఉన్న దివ్యాంగ పిల్లలను గుర్తించి వారికి అందుతున్న పౌష్టికాహారం, ప్రభుత్వ పథకాలు గురించి పూర్తిస్థాయిలో వివరాలు తెలుసుకుని వారికి అన్నీవర్తించేలా సర్వే నిర్వహించాలని ఎంఈవోలు సిబ్బందికి సూచించారు. సర్వేలో భాగంగా ఇప్పటి వరకు 21 మంది దివ్యాంగ పిల్లలను గుర్తించారు. సహిత విద్యా సమన్వయకర్త గోవిందరావు, ఐఈడీ ఉపాధ్యాయులు ఎ.మన్మథరావు, ఎం.ధనుంజయ ఉన్నారు.

జోరుగా పెదంచల రోడ్డు పనులు



పలాస సమీపంలో రోడ్డు పనులు పూర్తయిన దృశ్యం

కాశీబుగ్గ: పలాస మండలం పెదంచల గ్రామం నుంచి పలాస పట్టణానికి కలిపే పెదంచల ఆర్‌అండ్‌బి రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సుమారు పది కిలోమీటర్లు పొడవున్న రోడ్డు ఆధునికీకరణలో భాగంగా రూ. 2.15 కోట్లతో పనులు చేపడుతున్నారు. కంబిరిగాం కూడలి నుంచి పలాస పట్టణం వరకు రోడ్డు పనులు జరగకుండా వాయిదా పడ్డాయని ఇటీవల పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీనికి స్పందించిన ఆర్‌అండ్‌బీ ఏఈ విక్రమ్ ప్రత్యేకశ్రద్ధతో గురు, శుక్రవారాల్లో రోడ్డు పనులు పూర్తి చేశారు రోడ్డు పూర్తి కావడంతో పెదంచల, గోదావరిపురం, వీరరామచంద్రపురం, చినంచల, గంగువాడ, ఈదురాపల్లి, కేదారిపురం, కంబిరిగాం గ్రామాలకు చెందిన ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.